జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 28-9-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 468 పేజీలు: 4 వెల : రూ.7

# రైలు కనెక్టివిటీతోనే.. అభివృద్ధి



* శ్రీకాకుళం రోడ్డు నుంచి హైదరాబాద్, తిరుపతికి రైళ్లు తీసుకువస్తాం * రైతులు, వ్యాపారులకు అమృత్ భారత్ రైలుతో ఉపయోగం * పదేళ్లలో 17 రైల్వేస్టేషన్ల అభివృద్ధి * అమృత్ భారత్ రైలు.. దేశ రైల్వే రూపురేఖలు మార్చింది * విమానాల్లో ఉండే సదుపాయాలు అమృత్ భారత్ రైళ్లలోనూ * ప్రపంచంలో నాలుగవ ఆర్థిక శక్తిగా ఎదగడంలో మోదీ పాత్ర కీలకం * కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు * శ్రీకాకుళం రోడ్డులో అమృత్ భారత్ రైలు ప్రారంభం

**శ్రీకాకుళం, సెప్టెంబరు27(వార్త):** అభివృద్ధి జరగాలంటే ఆ ప్రాంతానికి కనెక్టివిటీ ఉండాలని, రైలు, రోడ్డు, జల రవాణా సదుపాయం ఉన్న ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ప్రధాని మోదీ వర్చు వల్‌గా ప్రారంభించిన బెర్హంపూర్-సూరత్ (ఉద్నా) అమృత్ భారత్ రైలును శనివారం శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై ఏర్పాటు చేసిన వేదికపై కేంద్ర మంత్రి మాట్లాడారు. అమృత్ భారత్ రైలు.. దేశ రైల్వే రూపురేఖలు మార్చేసిందన్నారు. శ్రీకాకుళం, పలాసలో రెండు హాల్ట్‌లు ఇచ్చినట్టు తెలిపారు. ఇందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు చెప్పారు. గతంలో వందే భారత్ కూడా మూడు స్టాపులతో జిల్లాకు విశేషంగా ఉపయోగపడిందని గుర్తు చేశారు. వందే భారత్ ప్రారంభించిన రోజునే జిల్లాకు అమృత్ భారత్‌పై హామీ లభించిందన్నారు. విమానాల్లో ఉండే సదుపాయాలు అమృత్ భారత్ రైళ్లలో ఉన్నాయని తెలిపారు. బెర్హంపూర్, ఉద్నా అమృత్ భారత్ ద్వారా శ్రీకాకుళంలో రైతులకు, వ్యాపారస్థులకు, మహిళలకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పదేళ్లలో జిల్లాలోని పదిహేడు రైల్వే స్టేషన్‌లలో విశేషమైన అభివృద్ధి సాధించామని, శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ కూడా వృద్ధిలోకి తీసుకొచ్చామన్నారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల లిస్టులో శ్రీకాకుళం కూడా ఉండటం.. ఈ స్టేషన్ కూడా త్వరలో కొత్త రూపు సంతరించుకుంటుందన్నారు. ఇంకోవైపు ఆమదాలవలస అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. చింతాడ నుండి ఆమదాలవలసకి కలిపే విధంగా వంద అడుగుల రహదారిని నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. డైనమిక్ లీడర్ ఆమదాలవలసలో ఉన్నారని.. అవగాహనతో, మంచి ఆలోచనతో ఉన్న లీడర్ కూన రవికుమార్ అని స్పష్టం చేశారు. రైల్వే బోర్డుపై జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలపై నిరంతరం ఒత్తిడి తీసుకువస్తూనే ఉన్నామని, శ్రీకాకుళం నుండి రెండు రైళ్లు బయల్దేరే విధంగా ప్రణాళికలు రచిస్తూ ఉన్నామన్నారు. ఇక్కడి నుండి హైదరాబాద్, తిరుపతి నగరాలను కలిపే విధంగా రైళ్లు తీసుకురావాలని నా ఆలోచన అని రామ్మోహన్ నాయుడు తెలిపారు. జిల్లాలో నౌపడ, పలాస, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌లను అమృత్ భారత్ పథకం కిందికి తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నామన్నారు. దేశంలో రైల్వే, విమానయాన రంగాలు పోటీ పడి అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయని తెలిపారు. విమానాల్లో ఉండే వసతులు రైళ్లలో వస్తూ ఉంటే.. రైళ్లు ఎక్కేంతగా ప్రజలు విమానాలు ఎక్కేలా రద్దీ కోసం తాను ప్రయత్నిస్తూ ఉన్నానన్నారు. ప్రపంచంలో నాలుగవ ఆర్థిక శక్తిగా ఎదగడంలో మోదీ పాత్ర కీలకమైనదన్నారు. సబ్బుల నుండి కార్ల వరకు జీఎస్టీ 2.0 ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోందన్నారు. మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల నాయకత్వంలో డబుల్ ఇంజన్ సర్కార్ అభివృద్ధి వైపు తీసుకువెళు న్నారని, వారి కృషికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అమృత్ భారత్ రైలును బోగీల్లో ఎక్కి పరిశీలించారు. రైలులో ప్రయాణిస్తున్న విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో రైల్వే డీఆర్ఎం లలిత్ బొహ్రా, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీసీసీబీ అధ్యక్షులు శివ్వల సూర్యనారాయణ, జనసేన ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.





## 1,2 తేదీల్లో కిరణ స్పర్శ



**అరసవల్లి, సెప్టెంబరు27(వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్య నారాయణ స్వామి మూల విరాట్టుకు అక్టోబర్ 1,2 తేదీల్లో కిరణాలు తాకనున్నాయని డిప్యూటీ కమిషనర్లు, కార్యనిర్వహణా ధికారి ప్రసాద్ తెలిపారు. మబ్బులు, పొగమంచు లేకుండా వాతావరణం ఉంటే స్వామి వారి కిరణ దర్శనం భక్తులకు కలుగుతుందన్నారు.

## కానిస్టేబుల్ అరెస్టు

**టెక్కలి, సెప్టెంబరు 27 (వార్త):** కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దమ్ము గోపాలకృష్ణను టెక్కలి పోలీసులు అరెస్టు చేశారు. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించినట్టు బాధితురాలు ఈనెల 16న టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేసిన టెక్కలి పోలీసులు.. గోపాలకృష్ణను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం శ్రీకాకుళం జిల్లా కేంద్ర కారాగానికి రిమాండ్ నిమిత్తం తరలించారు.



## ఏడుకొండల స్వామిగా.. వాసుదేవుడు

**మందస, సెప్టెంబరు 27 (వార్త):** దేవదేవుడైన వాసుదేవుడు ఏడుకొండలస్వామిగా భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామి దివ్యరూపాన్ని తిలకించిన భక్తులు ఒక్కసారిగా పంవశించిపోయారు. మందస పట్టణంలోని శ్రీవాసుదేవ పెరుమాళుని సన్నిధిలో వేదపండితులు, ఆలయ ప్రధాన అర్చకులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

## కాలువలపై ఆక్రమణలు తొలగించండి

* వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టండి * కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**శ్రీకాకుళం, సెప్టెంబరు 27 (వార్త):** వర్షపు నీరు నగర వీధుల్లో నిలిచిపోకుండా, కాలువల్లో ఎటువంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. శనివారం ఆయన పట్టణంలోని సెవన్ రోడ్ జంక్షన్, పాత బ్రిడ్జి, ముత్యాలమ్మ మార్కెట్, సత్యానగర్ ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి రహదారులు, కాలువల పరిస్థితిని సమీక్షించారు. పాత బ్రిడ్జి నుండి ఆర్ అండ్ బి రహదారిని పరిశీలించిన కలెక్టర్ వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గమనించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాలువలపై ఎక్కడైనా నిర్మాణాలు చేసి ఆటంకాలు కలిగిస్తే వాటిని తొలగించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్ల ఇరువైపులా కాలువలను పునరుద్ధరిస్తూ వర్షపు నీరు ఎటువంటి అడ్డంకులు లేకుండా నదిలోకి చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణంలో నీటి నిల్వ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేలా అధికారులు సమన్వయం చేసుకుని పని చేయాలని ఆయన ఆదేశించారు. ఈ తనిఖీలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, సహాయ ప్రణాళికాధికారులు వెంకటేశ్వరరావు, జానకి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యాటక కేంద్రంగా పంచధామ క్షేత్రం

**కోటబొమ్మాళి, సెప్టెంబరు27(వార్త):** మండలంలో గల చిన్న హరిశ్చంద్ర పురం గ్రామంలో నిర్మాణమైన పంచధామా క్షేత్రానికి పర్యాటక కేంద్రంగా గుర్తింపు లభించిందని టెక్కలి ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి తెలిపారు. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన పంచధామా క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గంలో ఆధ్యాత్మికంగా, పర్యాటకులకు మానసిక ప్రశాంతత కోసం ఈ పంచధామక్షేత్రం అన్ని హంగులతో ఆలయ ధర్మకర్త ఉప్పాడ కనకరాజు నిర్మించారని అభినందించారు. వచ్చే శివరాత్రి నాటికి ఈ క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు గాను కలెక్టర్, రాష్ట్ర మంత్రితో చర్చిస్తామన్నారు. ఆయన వెంట తహశీల్దార్ ఆర్ అప్పలరాజు, ఎంపీడీవో కె.ఫణీంద్ర కుమార్. టెక్కలి నియోజకవర్గం తెలుగు మహిళ అధ్యక్షురాలు, హరిశ్చంద్రపురం మాజీ సర్పంచ్ పూజారి శైలజ, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ పూజారి సత్యనారాయణ, గ్రామ పెద్దలు ఉన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఒట్టిగెడ్డలో మహిళ మృతదేహం లభ్యం

**వీరఘట్టం, సెప్టెంబరు 27(వార్త):** కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన రౌతు చిన్నమ్మడు(59) మహిళా మృతదేహం శనివారం స్థానిక ఒట్టిగెడ్డలో లభ్యమయింది. కుటుంబ సభ్యులు పోలీసులు చెప్పిన కథనం ప్రకారం చిన్నమ్మ డు కాల కృత్యాలు తీర్చుకునేందుకు ఒట్టిగెడ్డకు ఈ నెల 21న వెళ్ళింది. అయితే ప్రమాదవశాత్తూ కాలుజారి ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలో పడి కొట్టుకుపోయింది. అప్పటినుంచి కుటుంబ సభ్యులు గాలిస్తున్నప్పటికీ వ్యక్తి జాడలేదు. అయితే కొందరు వ్యక్తులు మృతదేహాన్ని చూడడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు.

దీనిపై ఆమె కుమారుడు అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి కళాధర్ విలేకరుల కు తెలిపారు.

# సూపర్ సిక్స్.. సూపర్ ఫ్లాప్ : రెడ్డి శాంతి




**హిరమండలం, సెప్టెంబరు 27(వార్త):** అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'సూపర్ సిక్స్' పథకాలు 'సూపర్ హిట్' అయ్యాయంటూ చేస్తున్న ప్రగల్భాలు పూర్తిగా అర్థంలేనివని, నిరాధారమైనవని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డి శాంతి తీవ్రంగా విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం మహిళల అకౌంట్లలో రూపాయి కూడా వేయలేని దుస్థితిలో ఉందని, వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. "టీడీపీ ప్రభుత్వం చెప్పే 'సూపర్ సిక్స్' అంతా ఒట్టి మాటల డొల్లతనం. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన హామీలు అటకెక్కాయని. ఏ ఒక్క మహిళా లబ్ధిదారుని ఖాతాలో కూడా రూ.1,500 ఆర్థిక సహాయం జమ చేయలేని ఈ ప్రభుత్వం, 'సూపర్ హిట్' అంటూ ఎలా ప్రకటించుకుంటుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఇది మహిళలను మోసం చేయడం కాదా అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికా రంలో ఉన్నప్పుడు వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి అనేక చారిత్రాత్మక సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు సాధికారత కల్పించారని గుర్తుచేశారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నా వడ్డీ వంటి పథకాలు రాష్ట్రంలోని కోట్లాది మహిళల జీవితాల్లో వెలుగులు నింపి, ఆర్థికంగా స్థిరత్వాన్ని ఇచ్చాయని వివరించారు. "పేద మహిళలను ఆర్థికంగా నిలబెట్టి, వారిని కుటుంబ నిర్ణయాల్లో భాగస్వాములను చేసిన ఘనత కేవలం జగన్ గారి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నవరత్నాల ద్వారా పేదరికం లేని సమాజాన్ని సృష్టించడానికి ఆయన అహర్నిశలు కృషి చేశారని ఆమె గుర్తు చేశారు . టీడీపీ ప్రభుత్వం తక్షణమే ప్రగల్భాలు పలకడం ఆపి, ఎన్నికల హామీలను నిస్సందేహంగా అమలు చేయాలని. టీడీపీ కూటమి పాలనలో ఆరోగ్య శ్రీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయటం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఉచిత వైద్యం అందక దిక్కులేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న అధికారంలో ఉన్నప్పుడు ఆరోగ్య శ్రీ ద్వారా పేద ప్రజలకు ఉచిత వైద్యం సక్రమంగా అందేదని గుర్తుచేశారు. ఆరోగ్య శ్రీ పరిధిని పెంచి, చికిత్స వ్యయం సుమారు రూ. 25 లక్షల వరకు కూడా వర్తించేలా చేసి, పేదలకు భరోసా కల్పించారని తెలిపారు. ఇప్పుడు ఈ పథకం నిర్లక్ష్యానికి గురై, పేదలు ప్రైవేటు ఆసుపత్రులలో వేలకు వేలు ఖర్చు చేయలేక, ప్రభుత్వ ఆసుపత్రులలో సరైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నత విద్యకు వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం అందించిన సంపూర్ణ సహకారాన్ని ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం అందించకపోవడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందన్నారు. రైతులకు ఎన్నడూ లేని సమస్య ఈ కూటమి ప్రభుత్వంలో వచ్చింది... రైతులు తీవ్రమైన కష్టాలు పడుతున్నప్పటికీ, వారి సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. రాష్ట్రంలో రైతులను కష్టాల పాలు చేస్తూ, యూరియా పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య ధోరణి చూపిస్తుందన్నారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగా రైతులు యూరియా కోసం బారులు తీరి తీవ్ర ఇబ్బందులు పడుతున్న సందర్భాలు ప్రతి ఏరియాలో కూడా ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "యూరియా కొరతను సృష్టించి, బ్లాక్ మార్కెట్‌లో యూరియా అమ్మకాలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియా అందించకుండా కష్టపెడుతుంటే, అధికార పార్టీ నాయకులు ఈ పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్నారు. మరీ దారుణంగా, టీడీపీ ఎమ్మెల్యే నాయకులు నేరుగా ఈ యూరియాను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటూ సొంత జేబులు నింపుకుంటున్నారు," అన్నారు. రైతుల కష్టాన్ని తమ స్వలాభం కోసం వాడుకుంటున్న అధికార పార్టీ నాయకుల తీరును ఖండించారు.

# సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై గ్రామాల్లో అవగాహన

**మందస, సెప్టెంబరు 27(వార్త):** ప్రభుత్వ ఆదేశాలతో ప్రాజెక్టు డైరెక్టర్ సూచనల మేరకు గ్రామ గ్రామాన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పై మహిళా సంఘాలకు వెలుగు సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మందస మండల పరిధిలోగల జిల్లుండ పంచాయతీలో స్వయం శక్తి సంఘాల పుస్తక నిర్వహణను పరిశీలిస్తూ, కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ(వస్తు సేవలపై పన్నులు) స్లాబ్ రేట్లను తగ్గించడం ద్వారా అధిక ధరలు తగ్గి పేద, మధ్య తరగతి వర్గాలుకు నిత్యావసర, గృహ అవసర వస్తువులు అందుబాటులో ఉంటాయని,



పన్నులు తగ్గడం వల్ల సాధారణ ప్రజానీకానికి కొనుగోలు శక్తి పెరుగుతుందని వివరించారు. రైతులు ఉపయోగిస్తున్న ట్రాక్టర్లు, మధ్య తరగతి వారు ఉపయోగిస్తున్న మోటారు బైకులు, ఎయిర్ కండీషనర్/కూలర్ ప్రతీ ఇంటిలో వినోదానికి ఉపయోగిస్తున్న టెలివిజన్లు, అందరికీ అత్యవసరమైన, నిత్యవసరమైన మొబైల్ ఫోన్లు తదితర అన్ని వస్తు సేవలపై ప్రభుత్వం పన్ను తగ్గించడం వల్ల ఇంతకు ముందు కంటే తక్కువ ధరలకు లభ్యమవుతున్నట్లు వివరించారు. కిరాణా ఫ్యాన్సీ వస్తువులు, రోగులకు నిత్యము అవసరమైన మందులు, దుస్తులు, పాదరక్షలు, స్టేషనరీ మొదలగు అన్ని రకాల వస్తువులపై ధరలు తగ్గడం వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలకు నెలవారి ఖర్చులులో మిగులు కనిపించి, సేవింగ్స్ గా ఉపయోగ పడుతున్నట్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వి.వో.ఏ. కేశమ్మ , గ్రామ సంఘం అధ్యక్షురాలు శ్రీదేవి, క్లస్టర్ కోఆర్డినేటర్లు మీనాక్షి, బాలకృష్ణతో పాటు స్వయం శక్తి సంఘాల లీడర్లు సభ్యులు పాల్గొన్నారు.



# యూరియా తక్షణమే అందివ్వాలి

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 27 (వార్త):** జిల్లాలో రైతులకు యూరియా తక్షణమే అందివ్వాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ నియోజకవర్గం వైస్సార్సీపీ సమన్వయ కర్త పిరియా విజయ డిమాండ్ చేశారు. రైతన్నకు బాసటగా అన్నదాత పోరులో భాగంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రస్తుత రైతు యూరియా కష్టాలు సమస్య పై రైతులు, వైస్సార్సీపీ నాయకులు, చేపట్టిన నిరసన కార్యక్రమం, విజయవంతం గా ముగిసింది. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకట రావు కి యూరియా తక్షణమే అందజేయుటకు, చర్యలు చేపట్టాలని, వినతిపత్రం అందజేశారు.రైతులకు ఎరువులు ఇవ్వకుండా అక్రమంగా కూటమి పార్టీ నాయకులుకే అందజేస్తూ, రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ పిరియా విజయ కూటమి ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈ రైతు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నవారు, సీడప్ మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ శ్రీమతి ఉప్పాడ నారాయణమ్మ, జడ్పీటీసి ప్రతినిధి తడక జోగారావు, మాజీ ఎంపిపి కారింగి మోహనరావు, మాజీ జడ్పీటీసీ నూకయ్య రెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానంద రెడ్డి, మాజీ ఏ ఎం సి చైర్మన్ బాబూరావు, నియోజకవర్గ యువజన సంఘ విభాగ అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్,మండలం ప్రెసిడెంట్ పాతిర్ల రాజశేఖర్,జె ఏ సి కన్వీనర్ జల్లు యుగంధర్,మాజీ డి సి ఎం ఎస్ ప్రతినిధి సల్ల దేవరాజు ఆశి పురుషోత్తం, ఎంపీటీసీ జగదీష్, త్రినాథ్, తులసి రాం, కుందేశీ ప్రియనాయక్, దుక్క ధనలక్ష్మి, సారధి నాగరాజు, బచ్చు జగన్, కాళ్ల మనోజ్, బాలరాజు, రమణ, చిరంజీవి, బాకీ లక్ష్మీనారాయణ, ఆశి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న సంగీత కచేరీ

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు27(వార్త):** మహతి సంస్క్రతిక సాంస్కృతిక కళాసేవా కళాకారులచే స్వేచ్ఛావతి ఆలయంలో సంగీతస్వరనీరాజనం ఆకట్టుకుంది. దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా మహతి సంస్కృతిక కళాసేవా సంస్థ కళాకారుల చే సంగీత స్వరనీరాజన కార్యక్రమంలో టి బరంపురం గ్రామానికి చెందిన తిప్పన ధనుంజయ రెడ్డి ఆధ్వర్యంలో గాయకులు దూట్ల వెంకటేశం చండిపుట్టుగా, బైరెడ్ల తారక్ రాజపురం, నర్తు గంగయ్య ఈదుపురం, కీబోర్డుపై తిప్పన ధనుంజయ రెడ్డి టీ బరంపురం, మృదంగంపై చలపరాయి వినోద్ కుమార్, మాస్టర్ సాయి చరణ్ కపాషకుద్దీ, తబలాపై పడాల పార్వతీశం , రాజేష్ రిథమ్ ప్యాడ్ సహకరించి భక్తులను తమ సంగీతంతో ఎంతో ఆకట్టుకున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి కళాకారులను ఘనంగా సత్కరించారు. స్వేచ్ఛవతి దేవీ నవరాత్రుల భాగంగా సంస్కృతిక కార్యక్రమాల్లో 5వ రోజు శాస్త్రీయ సంగీత కచేరి ఎం జె శర్మ సరస్వతి సంగీత విద్యాలయం విద్యార్థులచే ఇచ్ఛాపురం, తేలుకుంచి కవిటి కళాకారులు చే అమ్మవారికి స్వర అర్చన ఆకట్టుకుంది.





## కుంబిడి ఇచ్ఛాపురంలో పొలంబడి

**వీరఘట్టం, సెప్టెంబరు 27(వార్త):** గిరిజన గ్రామమైన కుంబిడి ఇచ్ఛాపురంలో శనివారం మండల వ్యవసాయ శాఖ అధికారి జక్కు సౌజన్య ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు ఇందులో భాగంగా జిల్లేడు కషాయం తయారుచేసి ఆయా పొలాల్లో రైతులచే పిచికారి చేయించారు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా కషాయాలను రైతులచే స్వయంగా తయారు చేయించి పంటలకు అవసరమయ్యే విధంగా పిచికారి చేస్తున్నమన్నారు. దీనివల్ల ఆరోగ్యకరమైన పంటలతో పాటు అధిక దిగుబడులు వచ్చేందుకు దోహద పడుతుందని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మండల్ యాంకర్ ఎం సింహాచలం రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో వంశధార సాధన



**మందస, సెప్టెంబరు 27(వార్త):** అందరి సహకారంతో వంశధార జలాలను సాధించుకోగలమని వంశధార సాగునీరు సాధన కమిటీ నాయకులు అన్నారు. అవిశ్రాంతంగా తన పోరాటాన్ని కొనసాగిస్తోంది. రాత్రి వేళల్లో గ్రామాల్లో పర్యటిస్తున్న కమిటీ నాయకులు అనంతపురం, మామిడిపల్లి, రాణిగాం తదితర గ్రామాల్లో పరతాటించారు. ఆయా గ్రామాల రైతులను కలసి, వంశధార సాగునీటి ఆవశ్యకతను వివరించారు. వంశధార జలాలు ఈ ప్రాంతానికి రావాలంటే రైతులంతా ఐక్యంగా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పంచాయతీ తీర్మానం, పోస్ట్ కార్డు ఉద్యమం, గ్రామ కమిటీలు నిర్మాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మార్పు మన్మధరావు, ప్రధాన కార్యదర్శి ధర్మార్పు వెంకటరావు, దుంపల వైకుంటారావు, నల్ల హడ్డి, కొవ్వూరు దశరధి, నర్సింగ్ నాథ్ సాబతో తదితరులు పాల్గొన్నారు.

## మాతా, శిశు సంరక్షణకు చర్యలు



**జలుమూరు, సెప్టెంబరు 27(వార్త):** మాతా, శిశు సంరక్షణకు చర్యలు తీసుకుంటామని సారవకోట ఐసీడీఎస్ సీడీపీఓ వంశీ ప్రియ తెలిపారు. శనివారం జలుమూరు మండలం కరవంజ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మహా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాతా, శిశు సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వనున్నామని గర్భిణీ, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆమెతో పాటు సూపర్వైజర్ మనోహరి ఉన్నారు.

## గ్రామ దేవతా వృక్షం పునః ప్రతిష్ఠ

**నరసన్నపేట, సెప్టెంబరు 27(వార్త):** లుకలాంలో అసిరితల్లి గ్రామ దేవత వృక్షం పునః ప్రతిష్ట కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇటీవల చీడ పడి వల్ల గ్రామ దేవత వృక్షం చనిపోవడంతో మళ్లీ అదే చోట గ్రామస్థుల ఆధ్వర్యంలో తొలుత భూమిపూజ చేశారు. విశేష పూజలు నిర్వహించి గ్రామ దేవత నూతన వృక్షాన్ని ఏర్పాటు చేశారు. అక్టోబర్ 8వ తేదీ నుంచి వారం రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# చిరంజీవిపై బాలకృష్ణ వ్యాఖ్యలు సరికాదు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 27( వార్త):** సినీ జగత్ విఖ్యాత మెగాస్టార్ చిరంజీవి పై హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు సరికాదని చిరంజీవి ఫాన్స్ ప్రతినిది కట్టా సూర్యప్రకాష్ ఖండించారు.రెండు తెలుగు రాష్ట్రాల లో చిత్ర పరిశ్రమ ద్వారా దేశ స్థాయిలో వన్నె తెచ్చారని అన్నారు. ఇప్పటికే ప్రపంచ స్థాయిలో దిగజారి పోతున్న పరువును ఇటువంటి అర్ధ రహిత వాఖ్యలు తో మరింత పలుచన చేస్తున్నారని అన్నారు. వెంటనే చిరంజీవి కి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



## శిలాశాసన ప్రాంతాన్ని అభివృద్ధి చేయండి

**పోలాకి, సెప్టెంబరు 27(వార్త):** దీర్ఘాసిలోని 9వ శతాబ్దం నాటి శిలాశాసనం వద్ద ప్రపంచ పర్యాటక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మండల ప్రత్యేక అధికారి వెంకట మధు అధ్యక్షతన శనివారం ఈ సమావేశ నిర్వహించారు. దుర్గమ్మ కొండ శిలాశాసనం ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పరచాలని బాపూజీ యువజన సంఘ ప్రతినిధులు, రాజకీయ ప్రతినిధులు ప్రత్యేక అధికారికి వినతిపత్రం అందజేశారు.

## తేలుకుంచిలో ప్రపంచ పర్యాటక దినోత్సవం




**ఇచ్ఛాపురం, సెప్టెంబరు27(వార్త):** జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు నియోజక వర్గ స్పెషల్ ఆఫీసర్ పీడీ డ్వామా సుధా కర్‌రావు పర్యవేక్షణలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని తేలుకుంచి గ్రామంలో ఉన్న వెట్ ల్యాండ్/చిత్తడి నేల (తేలుకుంచి పక్షి సంరక్షణ కేంద్రం) వద్ద ఘనంగా నిర్వ హించారు. ఈ పక్షి సంరక్షణ కేంద్రం వేలాది సైబీరియన్ కొంగలకు నిలయంగా ఉంది. ఎమ్మెల్యే అశోక్ ఆదేశాలకు అనుగుణంగా ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి, ఎక్కువ మంది పర్యాట కులను ఆకర్షించే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు అన్నారు.ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి , తహశీల్దార్ వెంకటరావు, ఎంపీడీవో కార్యాలయ ఏఓ రామారావు , గ్రామ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ సూర్యనారాయణ రెడ్డి,యంగ్ ప్రొఫెషనల్ నవీన్,పంచాయితీ సెక్రటరీ,విజన్ యాక్షన్ ప్లాన్ టీం సభ్యులు, పర్యాటకులు, స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.

## దుర్గామాతకు చూర్ణాభిషేకం



**నరసన్నపేట, సెప్టెంబరు 27(వార్త):** నరసన్నపేటలోని శ్రీరామగీత మందిరంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం అమ్మవారికి ప్రత్యేకంగా ముత్తైదువులు చూర్ణాభిషేకం చేశారు. ప్రధాన అర్చకులు పీసపాటి సూరిబాబు మాట్లాడుతూ.. పంచమి తిథి సందర్భంగా అమ్మవారికి చూర్ణభిషేకం నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలు విరివిగా పాల్గొన్నారు.

## 29న పిఎం స్వనిధి లోక కళ్యాణ్ మేళా

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 27(వార్త):** ఈ నెల 29న పీఎం స్వనిధి లోక్ కళ్యాణ్ మేళా నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమేష్ చెప్పారు. వీధి వ్యాపారులకు 10 వేల రూపాయలు నుండి 50 వేల రూపాయల వరకు రుణాలు మంజూరు కోసం మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు.ఆహార భద్రత పై అవగాహన, వైద్య శిబిరం నిర్వహణ, యూ పి ఐ రూపే క్రెడిట్ కార్డ్ పై అవగాహన కల్పిస్తామని చెప్పారు.

## ప్రచారహోరుతో చెవుల్లో చిల్లు

**నరసన్నపేట, సెప్టెంబరు 27(వార్త):** నరసన్నపేటలోని ప్రధాన రహదారి ప్రాంతమంతా ధ్వని కాలుష్యంతో నిండిపోతుంది. చెవులు చిల్లులు పడేటట్లు స్పీకర్లతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బట్టలు, బంగారం షాపులు మొదలుకొని, కూరగాయలు, పళ్లు వరకు ప్రతి చోటా మైకుల హోరు పెద్ద ఎత్తున కొనసాగుతోంది. ప్రజలు ఈ ధ్వనులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# అసెంబ్లీలో వాణిని బలంగా వినిపించిన ఎంజీఆర్

**ఎల్ఎన్ పేటకు పోలీస్‌స్టేషన్, పాతపట్నంకు**

**అగ్నిమాపక శకటం మంజూరు చేయాలని**

**కోరిన ఎమ్మెల్యే గోవిందరావు**



**ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 27(వార్త):** పాతపట్నం నియోజకవర్గ ప్రజా సమస్యలే తన గళమని పాతపట్నం నియోజవర్గ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు శనివారం ఆయన అసెంబ్లీ వేదికపై మరోసారి బలంగా వినిపించి పాతపట్నం నియోజకవర్గ వర్గానికి అగ్నిమాపక శకటం, ఎల్ఎన్ పేట మండలానికి పోలీస్ స్టేషన్ మంజూరు చేయాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాతపట్నం నియోజకవర్గం ప్రజలతో పాటు నాయకులు మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం శ్రమించి నియోజవర్గంలో ఉన్న సమస్యల్ని అసెంబ్లీలో వినిపించే నాయకుడే ఎమ్మెల్యే గోవిందరావు నిజమైన ప్రజా నాయకుడని, ఆయనకు నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# వైస్సార్సీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్ శ్రీరామరక్ష



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు27(వార్త):** వైస్సార్సీపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన ఇటీవల పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో అన్యాయానికి గురైన కార్యకర్తలకు, అండగా నిలవడానికి, "డిజిటల్ బుక్"ను ఆవిష్కరించారు. ఈ డిజిటల్ బుక్ ను నియోజకవర్గ స్థాయిలో జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ మరియు నియోజకవర్గ సమన్వయ కర్త పిరియా విజయ సమక్షంలో రోటరీ హాలులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్యనాయకులు సీడప్ మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ లు పైల దేవదాస్ రెడ్డి, బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, జడ్పీటీసీ ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, మున్సిపల్ ఛైర్పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, మున్సిపల్ వైస్ ఛైర్పర్సన్ ఉలాల భారతి దివ్య, కారింగి మోహన్ రావు, కంచిలి మండలం ప్రెసిడెంట్ వజ్జ మృతంజయరావు, బాబురావు, పిలక సంతు, టౌన్ ప్రెసిడెంట్లు, ప్రకాశరావు పట్నాయక్, కాళ్ల సత్యం, నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్, కౌన్సిలర్లు, బచ్చు జగన్, సుగ్గు ప్రేమ్ కుమార్, సాలిన ఢిల్లీ, నీలాపు డిల్లి, చాట్ల తిరుపతి, దువ్వ వివేకానంద రెడ్డి,ఆసి పురుషోత్తం, కొనపల సురేష్, కాళ్ల మనోజ్, బతకల మోహనదాసు, ఇసురు తులసిరామ్, చిరంజీవి, ఆసి కృష్ణారెడ్డి, మెండా మురళి, తిరుపతి, మరియు సర్పంచ్లు, ఎంపిటిసీలు, కార్యకర్తలు తడి పాల్గొన్నారు.

# శ్రీవెంకటసాయి కళాశాలలో ఘనంగా వెల్‌కమ్ పార్టీ






**సరుబుజ్జిలి, సెప్టెంబరు 27(వార్త):** సరుబుజ్జిలిలోని శ్రీవెంకటసాయి జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సర ఇంటర్మీడియట్ విద్యార్థినీ విద్యార్థులు ఘనంగా ఫేర్వెల్ పార్టీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ వెంకట సాయి విద్యాసంస్థలు అధినేత కూన జగన్నాథం రావు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ బి పురుషోత్తం రావు విచ్చేశారు. వెంకట సాయి స్కూల్ ఏఓ కూన వాసు అధ్యక్షతవహించారు. ముఖ్యఅతిథి జగన్నాథరావు మాట్లాడుతూ ప్రతి పనిలోనూ ప్రయత్న లోపం లేకుండా పట్టుదలతో ముందుకు నడిస్తే విజయం తానుగా సొంతమవుతుందన్నారు. విద్యార్థిని విద్యార్థులకు విద్యాపరంగా ఆసక్తికరమైన అంశాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా కృషి చేయాలని, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా జీవితాన్ని మలుచుకోవాలని సూచించారు. విశిష్ట అతిథి పురుషోత్తం రావు మాట్లాడుతూ వర్షం చినుకు కాలిన ఇనుము మీద పడితే ఆవిరైపోతుందని, తామరాకు మీద పడితే మెరుస్తుందని, కొన్ని చినుకులు సముద్రంలోని ఉప్పు నీటిలో చొచ్చుకొని పోయి ఆల్చిప్పలో పడి ముత్యంగా మారతాయని, విద్యార్థి ఏ చినుకుగా ఉంటాడో ఈ దశలోనే నిర్ణయించుకోవాలన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ను ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేశారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మాట్లాడుతూ కూన వాసు ఆ రోజుల్లోనే ఉత్తమ ప్రతిభతో మెడిసిన్ లో మంచి ర్యాంకు సంపాదించి స్వయంకృషితో పట్టుదలతో మంచి ప్రతిభను కనబరుస్తూ సమాజానికి సేవ చేస్తున్నారని ఇటువంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. శ్రీ వెంకట సాయి కళాశాల అభ్యున్నతికి అధ్యాపకులే కారణమని, కళాశాల స్థాపించిన దగ్గర్నుంచి ఇప్పటివరకు ఎంతోమంది విద్యార్థులు ఎన్నో రంగాల్లో ఉన్నతంగా స్థిరపడ్డారని తెలిపారు. విద్యార్థులు సమాజసేవ మానవతా విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. 2024 మంచి పర్సంటేజ్ సాధించిన విద్యార్థిని విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా పుష్పగుచ్చాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల, సీనియర్ అధ్యాపకులు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి. పురుషోత్తం రావు సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆధునిక విధానంలో సాగు చేయండి

**మెళియాపుట్టి, సెప్టెంబరు 27(వార్త):** నేటి సమాజంలో వ్యవసాయ అధికారుల, సిబ్బంది సూచనలు సలహాలతో శాస్త్ర సాంకేతిక విధానాలు అవలంబిస్తు నూతన వ్యవసాయ సాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు మండేలా రామారావు అన్నారు. వ్యవసాయధికారి దానకర్ణుడు నేతృత్వంలో మెలియాపుట్టి మండలంలో గల కోసమాల గ్రామంలో గ్యాప్ సర్టిఫికేషన్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పొలంబడి కార్యక్రమంలో రైతులకు శాస్త్ర, సాంకేతికతో పాటు ఎరువుల యాజమాన్యం, సేంద్రియ ఎరువులు, పురుగు మందుల వినియోగం, స్వల్పకాలిక దీర్ఘకాలిక ప్రయోజనాలు తదితర వాటిపై




క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రీయ పద్ధతి ద్వారా ద్రవ జీవామృతాల తయారి పొలంలో వాడుకునే విధానం గురించి అవగాహన కల్పించడం కల్పించారు. పొలంబడి కార్యక్రమంలో 30 మంది రైతులు 25 ఎకరాలు ఎంపిక చేయడం జరిగిందని, 14 వారాలు పాటు జరిగే ఈ పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తూ, పంట కోత సమయంలో వారి వద్ద నున్న ధాన్యము శాంపుల్ స్వీకరించి టెస్టింగ్ కి పంపించి పురుగు మందుల అవశేషాలు పరీక్ష జరిపి రైతులకు సర్టిఫికేషన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఉద్దానం ఎఫ్ పి ఓ ద్వారా ధాన్యం కొనుగోలు చేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి ఎస్. దానకర్ణుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు క్రాంతి, ఉద్దానం ఎఫ్పి ఓ సీఈవో భాగ్యలక్ష్మి, ప్రకృతి వ్యవసాయం క్లస్టర్ ఇన్చార్జి జయలక్ష్మి మరియు రైతులు తదితరులు ఉన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## కాత్యాయని రూపంలో స్వేచ్ఛావతి

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 27(వార్త):** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు లో భాగంగా గ్రామ దేవత స్వేచ్ఛ వతి అమ్మవారు కాత్యాయని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.అమ్మవారి అంతరాలయం లో జరిగే వైదిక కార్యక్రమాలు భక్తులు రద్దీ దృష్ట్యా అందరికీ వీక్షణ కల్పించేందుకు ఆలయ ప్రాంగణంలో ఎల్ ఈ డి స్క్రీన్ ఏర్పాటు చేశారు. దేవి నవరాత్రుల సందర్భంగా ఆరవ రోజు లలిత త్రిపుర సుందరి అవతారం లో తులసి గాం వైదేహి మాత అమ్మవారు దర్శనమిచ్చారు.



# ఉద్దానం వలస కార్మికులకు అమృతభారత్ ఉపయోగం

**బరంపురం నుంచి సూరత్ బయలుదేరిన**
**అమృత్ భారత్ రైలుకు పలాసలో స్వాగతం**
**పలికిన మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు**

**పలాస, సెప్టెంబరు 27(వార్త):** పేద, మధ్యతరగతి కి మెరుగైన ప్రయాణం అందించే ఉద్దేశంతో అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లను భారతీయ రైల్వే నడుపుతోందని, అందులో భాగంగా ఉద్దానం ప్రాంత వలస కార్మికులకు ఒడిస్సా నుంచి గుజరాత్ వరకు ఆంధ్రప్రదేశ్ మీదుగా నడిపే అమృత్ భారత్ రైలు వలన ఎంతో ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడు తుందని పలాస - కాశిబుగ్గ పురపాలక సంఘం చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. శనివారం ఒడిస్సా రాష్ట్రంలోని బరంపురం నుంచి సూరత్ మధ్య 09022 నెంబర్ గల అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైలు సేవలను భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చునల్ పద్ధతిలో లాంఛనంగా ప్రారంభించగా ఈ రైలును పలాస రైల్వే స్టేషన్ లో ఆగినప్పుడు సాదరంగా రైల్వే ఉన్నతాధికారులతో పాటు చైర్మన్ బల్ల గిరిబాబు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బల్ల గిరిబాబు మాట్లాడుతూ, అమృత్ భారత్ రైలు భారత రైల్వే చరిత్రలో విప్లవాత్మకమైన మార్పును తీసుకు రాగలరని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఎందుకంటే ఇది సాధారణ ప్రయాణికులకు తక్కువ ఖర్చుతో, నాణ్యమైన ప్రయాణాన్ని ఒక హై స్పీడ్ రైలు అని, దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 11 రైలు అందుబాటులోకి వచ్చాయని, తాజాగా బ్రహ్మపుర - సూరత్ రైల్వే స్టేషన్ల మధ్య ఈ రైలు అందుబాటులోకి రావడం వల్ల ఉత్తరాంధ్రకు చెందిన వలస కార్మికులకు ఎంతో ఉపయోగపడుతుందని గిరిబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖ ఉన్నతాధికారులు, ఖుర్దా రోడ్డు ఏ డి ఆర్ ఎం ప్రదీప్ కుమార్ బెహరా, ఖుర్దా రోడ్డు డివిజన్ పర్సనల్



ఆఫీసర్ పి.కె బెహరా, ఖుర్దా రోడ్డు డివిజన్ సిగ్నల్ టెలికం అధికారి బి కే జెన, అసిస్టెంట్ సెక్యూరిటీ కామెనేట్ ఎస్ సంజయ్, డివిజన్ కమర్షియల్ మేనేజర్ రమాకాంత్ హరోర, డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ కె శ్రీను, అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ ఆర్ కె ఖట్టవ, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, రైల్వే ప్రయాణికుల అసోసియేషన్స్ ప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులు డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలి

**పలాస, సెప్టెంబరు 27(వార్త):** వీధి వ్యాపారులు డిజిటల్ లావాదేవీలను (యూపీఐ) ప్రోత్సహించాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.వెంకటరావు అన్నారు. పలాస-కాశీబుగ్గ మెప్మా ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పీఎం స్వనిది 2.0 'లోక కళ్యాణ్ మేళా' పథకం పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సిటీ మిషన్ మేనేజర్ మోహన్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెప్మా పీడి మాట్లాడుతూ వీధి విక్రయదారులు, చిన్న వ్యాపారులు పీఎం స్వనిది 2.0 ద్వారా మూడవ విడత వరకు రుణ సౌకర్యం పొందవచ్చని తెలిపారు. మొదటి విడతలో రూ.15,000, రెండవ విడతలో రూ.25,000, మూడవ విడతలో రూ.50,000 వరకు రుణాలు అందనున్నట్లు వివరించారు. ఇప్పటివరకు రుణాలు పొందని అర్హులైన లబ్ధిదారులు మేప్మా కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బ్యాంకులు అర్హులైన వారికి వెంటనే రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఎ.శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన, సురక్ష భీమా యోజన వంటి ఇన్సూరెన్స్ పథకాలలో వీధి



వ్యాపారులు తప్పక భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. సిటీ మిషన్ మేనేజర్ మోహన్ రావు మాట్లాడుతూ వీధి వ్యాపారులు డిజిటల్ లావాదేవీలను (యూపీఐ) ప్రోత్సహించా లని సూచించారు. ఇలా చేస్తే క్యాష్‌బ్యాక్ లాంటి ప్రయోజనాలు కూడా లభించను న్నాయని చెప్పారు. ప్రతి చిరు వ్యాపారి పీఎం స్వనిది పథకంలో పేరు నమోదు చేసుకోవాలనీ, పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వెండింగ్ జోన్లలో వ్యాపారం చేయాలనిది సూచించారు. పీఎం స్వనిది 2.0 లో పలాస - కాశీబుగ్గ నందు సుమారు 1500 లోన్స్ మంజూరు చేయనున్నాము అని ఈ అవకాశంను వీధి వ్యాపారస్తులు అందరూ సద్వినియోగ పరుచుకోవాలి అని తెలియజేసారు. మెప్మా జిల్లా అధికారి ఎల్ హెచ్ కిషోర్ మాట్లాడుతూ రుణదారులు బ్యాంకుల ద్వారా రుణం పొందడం ద్వారా వడ్డీ వ్యాపారులపై ఆధారపడకుండా, ప్రభుత్వ రాయితీలను పొందే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ మోహన్ రావు, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీరాములు, యూపీఏమేనేజర్ ధనుంజయ్‌శ్రీ, మెప్మా సిబ్బంది, ఆర్.పిలు, టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులు, టిఎల్ఎఫ్ఓబిఎస్, అనేక మంది వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

# ఈఎన్‌సీ నాయక్ దృష్టికి డిమిరియా బ్రిడ్జి సమస్య

**యుద్ధప్రాతిపదికన నిర్మించాలన్న శిరీష**

**మందస, సెప్టెంబరు 27(వార్త):** డిమిరియా బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. ఈ సమస్య పరిష్కారానికి పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. మూడు పిల్లర్లుండే ఈ బ్రిడ్జి ఓ వైపు పిల్లర్ కూలిపోయింది. దీంతో ఏ క్షణాన బ్రిడ్జి కుప్పకూలుతుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మందస మండలంలోని జిల్లుండ పంచాయతీలో గల డిమిరియా గ్రామానికి సునాముది గెడ్డపై రాజుల కాలంలో నిర్మించిన బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని, కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. బ్రిడ్జి కూలిపోతే గ్రామంతో పాటు ఇతర



ప్రాంతాలు, పొలాలకు వెళ్లడానికి దారి కరువవుతుంది. ఈ తరుణంలో సమస్యను ఎంఎల్ఏ శిరీషా దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. స్పందించిన ఆమె ఇంజనీరింగ్ అధికారులను సంఘటనా స్థలానికి వెళ్లి, పరిస్థితిని సమీక్షించి.. కొత్త బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు వేయాలని ఆదేశించారు. దీంతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు సుమారు రూ.1.95కోట్లతో నూతన బ్రిడ్జి నిర్మాణానికి అంచానాలు వేశారు. ఈ సమస్యను ఎంఎల్ఏ శిరీషా అమరావతిలోని ఈఎన్ సీ నాయక్ దృష్టికి తీసుకువచ్చారు. స్థానికులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. యుద్ధ ప్రాతిపదికన బ్రిడ్జి నిర్మించాలని ఆమె ఈఎన్ సీని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు.

# పలాస పరిశుభ్రతను తనిఖీ చేసిన అసిస్టెంట్ కలెక్టర్



**పలాస, సెప్టెంబరు 27(వార్త):** పలాస మున్సిపా లిటీ పరిధిలో అమలు జరుగుతున్న పారిశుద్ధ్య పను లను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ పృధ్వీరాజ్‌కుమార్ ఆక స్మిక విజిట్ చేశారు. ఈమేరకు పట్టణము లోని కొన్ని ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కలెక్టర్ ఆదే శం ప్రకారం పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘము నకు తనిఖీ నిమిత్తము శనివారం పలాస చేరుకున్న జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు హార్దిక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ శని వారం పురపాలక సంఘంలోని మొగలిపాడు జంక్షన్, కాశీబుగ్గ సంత మైదానం, ఉదయపురం ఏకాంబరే శ్వర గుడి వీధి, కాశీబుగ్గ ఆంధ్ర బ్యాంకు రోడ్డు లలో తిరిగి శానిటేషన్ జరుగుతున్న తీరును సమగ్రంగా ఇన్స్పెక్ట్ చేసి శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నెలవారీ యాక్షన్ ప్లాన్ తయారుచేసుకొని శానిటేషన్‌ను మెరుగుపరచవలసిందిగా సూచిం చారు. ఈ పురపాలక సంఘం సరిహద్దు గ్రామామైన ఉప్పరపేట లోను, కాశీబుగ్గ డంపింగ్ యార్డ్ ను పరిశీలించారు. డంపింగ్ యార్డ్ లో పేరుకుపోయిన లెగసీ వేస్ట్ ను ఇన్స్పెక్ట్ చేసి సదరు లెగసీ వేస్ట్ అంత ఎక్కువగా ఎందుకు పేరుకు పోయింది ఆరా తీశారు. తదుపరి కాలువలలో పేరుకుపోయిన సిల్ట్ తీయించే పద్ధతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వారితో పాటు శానిటేషరీ ఇన్స్పెక్టర్లు, పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.



## ఈ క్రాప్ నమోదు గడువు ముగింపు

**నరసన్నపేట, సెప్టెంబరు 27(వార్త):** ఖరీఫ్ సీజన్ పంటలకు సంబంధించి ఈ క్రాప్ నమోదు గడువు ఈ నెల 30తో ముగుస్తుందని వ్యవసాయ శాఖ ఏడీ ఎల్ వెంకట మధు తెలిపారు. నరసన్నపేటలో ఈ క్రాప్ నమోదును పరిశీలించారు ఇప్పటికీ ఈ క్రాప్ వివరాలు నమోదు చేసుకోని రైతులు త్వరపడాలన్నారు. పంటల బీమాతో పాటుగా, ఇన్పుట్ సబ్సిడీ, రైతులు పండించిన పంట కొనుగోలుకు ఈ క్రాప్ తప్పనిసరి అన్నారు. ఏవో సూర్య కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

## 'చాందిని' మానవత్వం



**మందస, సెప్టెంబరు 27(వార్త):** రక్తదానంలో మరో ప్రాణం కాపాడవచ్చు. తోటి మనిషికి సాయపడడానికి మానవతావాదులు ముందుకు వస్తున్నారు. రక్తదానం ఎక్కువగా పురుషులే చేయడం ఎక్కువగా కనిపిస్తోంది. ఇటీవల కాలంలో మహిళలు కూడా రక్తదానికి ముందుకు వస్తున్నారు. తలసేమియాతో బాధ పడుతున్న ఓ చిన్నారికి రక్తం అవసరం కావడంతో కిల్లోయి గ్రామానికి చెందిన చాందిని విషయం తెలుసుకుని, ఆసుపత్రికి వెళ్లి మరీ రక్తదానం చేశారు. ముక్కు, ముఖం, ఊరు, పేరు తెలియని సాటి మనిషి కష్టాల్లో ఉన్నారంటే.. ఓ మాతృమూర్తి (చాందిని) స్పందించి, రక్తదానం చేయడంపై పలువురు ఆమె మానవత్వానికి అభినందిస్తున్నారు. 'ఆ నలుగురు' సంస్థ ద్వారా విషయం తెలుసుకుని చాందిని రక్తదానం చేశారు. ఆమె స్ఫూర్తి ప్రతీ ఒక్కరికీ ఆదర్శం కావాలని స్థానికులు కోరుతున్నారు.

## నేడు హరిపురంలో
## వంశధాం సాధన కమిటీ సమావేశం

**మందస, సెప్టెంబరు 27(వార్త):** మార్పు గ్రంథాయలయంలో ఈ నెల 28న వంశధార సాగునీరు సాధన కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు వంశధార సాగునీరు సాధన కమిటీ నాయకులు చెప్పారు. మందస మండలంలోని హరిపురంలోని మార్పు గ్రంథాలయంలో ఉదయం 10గంటలకు జరిగే ఈ సమావేశానికి సభ్యులు తప్పక హాజరు కావాలని అధ్యక్షుడు మార్పు మన్మధరావు కోరారు.

## గొల్ల వీధిలో నూతన పవర్ బోర్

**పలాస, సెప్టెంబరు 27(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి, 26వ వార్డు, గొల్ల వీధిలో టిడిపి నాయకుడు వార్డు కౌన్సిలర్ తంగుడు ఆశారాణి హరిశంకర్ నూతన పవర్ బోర్ ను సతీసమేతంగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ కాలనీవాసులు మాట్లాడుతూ ఇదివరకు త్రాగునీటికి చాలా దూరం వెళ్ళవలసి వచ్చేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ పరిస్థితిని అర్థం చేసుకొని నియోజకవర్గం ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాలతో పవర్ బోరును నిర్మించి మాకు మేలు చేశారని సంతోషం వ్యక్తం చేశారు. వార్డు కౌన్సిలర్ మాట్లాడుతూ నీటిని వృధా చేయకుండా ప్రతి ఒక్కరూ ఈ నీటిని వినియోగించుకోవాలని, పవర్ బోర్ కావటం వలన స్విచ్ వేసేటప్పుడు, ఆపేటప్పుడు జాగ్రత్త వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలాస కాశీబుగ్గ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, పట్టణ కార్యదర్శి సప్ప నవీన్, శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణ, పి.సి.ఎమ్.ఎ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, 29 వ వార్డు కౌన్సిలర్ జోగ త్రివేణి మల్లేశ్వరరావు, 31వ వార్డు ఇంచార్జి కొరికాన శంకరరావు, పి.సి.ఎమ్.ఎ కార్యదర్శి టాంకాల రవి శంకర్ గుప్తా, పలాస ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ మెంబర్ దడియాల నరసింహులు, పట్ట మల్లేశ్వరరావు, బోనెల బైరాగి, కార్యకర్తలు కాలనీవాసులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546